క్లుప్తంగా

తీర స్వచ్ఛత అందరి బాధ్యత



యారాడ తీరంలో తొలగించిన చెత్తాచెదారంతో ఇస్పరల్ ప్రతినిధులు

పెదగంట్యాడ: పర్యావరణ పరిరక్షణ, తీర స్వచ్ఛత అందరి బాధ్యత అని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ (ఇస్పరల్) ప్రతినిధులు అన్నారు. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. మినిస్టరీ ఆఫ్ పెట్రోలియం నేచురల్ గ్యాస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారం ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వచ్ఛభారత్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా మండలంలోని యారాడ బీచ్‌ను సోమవారం శుభ్రం చేశామని చెప్పారు. ఈ నెల 16 నుంచి సుమారు 100మంది వలంటీర్లతో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, యారాడ బీచ్ క్లీనింగ్‌తో ముగించామని తెలియజేశారు.

ధర్మారావుకు సాహితీ విఖ్యాత పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జీవీఎంసీ స్కూల్ ఉపాధ్యాయుడు ధర్మారావు

సీతంపేట: అర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ఇటీవల ఇంటర్‌నెట్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి రికార్డ్ కవితల పోటీలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పనిచేస్తున్న గ్రేడ్ 1 తెలుగు ఉపాధ్యాయుడు ఎం.వి.ధర్మారావుకు సాహితీ విఖ్యాత అంతర్జాతీయ పురస్కారం వరించింది. కరీంనగర్ పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం, సన్మానం అందుకున్నారు. ఒక్క గంట వ్యవధిలో నాలుగు కవితలు రాసినందుకు తన సాహితీ ప్రతిభను గుర్తించి పురస్కారం ప్రదానం చేశారని ఆయన తెలిపారు. కవి, విశ్లేషకులు భవానీ సాహితీ కళావేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా స్వర్ణ కంకణం గౌరవాన్ని పొందారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన సలహాదారులు పొర్ల వేణుగోపాల్, కణిక సాహితీ ప్రక్రియ రూపకర్త రమాదేవి కొలకలూరి పాల్గొన్నారు. ఈ అవార్డు రావడంపై ధర్మారావును స్కూల్ హెచ్ఎం బి.లక్ష్మీనరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుబజారులో అధికారుల తనిఖీలు



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాలపట్నం: తూనికలు కొలతల అధికారులు గోపాలపట్నం రైతుబజారులో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గాజువాక లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రణ అధికారి ఎస్ఎం రాధాకృష్ణ వినియోగదారులు కొనుగోలు చేసిన తర్వాత వారి సరుకులను ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు సరకులు కొనుగోలు చేసినపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. తూనిక యంత్రంలో సున్నాలు కనిపిస్తున్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు. రైతులు కాటాలకు సీలు వేయించుకోవాలని సూచించారు. ప్రతీ స్టాల్‌కు వెళ్లి తూనిక యంత్రాలను పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్. ఉమాదేవి, రైతు బజారు ఈవో నారాయణరావు, సహాయకుడు శివ పాల్గొన్నారు.

త్వరితగతిన చెరువుల అభివృద్ధి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- మింది, కృష్ణమహంతి చెరువుల పరిశీలన



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి



మింది చెరువు వద్ద అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ పరిధిలో ఉన్న నీటి వనరుల (చెరువులు) అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 68వ వార్డు మింది, 69వ వార్డు నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువులను ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ శ్రీనివాస్‌తో కలిసి కమిషనర్ సోమవారం పరిశీలించారు. 14.5 ఎకరాల మింది చెరువును పరిశీలించిన కమిషనర్ చెరువు చుట్టూ రోడ్డుతో పాటు స్టోర్ ఫిక్సింగ్ చేయాలని అధికారులకు సూచించారు. నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువులో 10 వేల గంబూషియా చేపలను వేయాలని ఆదేశించారు. చెరువు చుట్టూ సుందరంగా రహదారిని ఏర్పాటు చేయడంతో పాటు లైటింగ్ నిర్మించాలని సూచించారు. చెరువుకు వాకింగ్‌కు వచ్చే వారి కోసం ఎంట్రన్స్‌ను విస్తృతం చేసి, సుందరంగా చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎస్.రవి, గ్రీన్ కార్పొరేషన్ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు, గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, కార్యనిర్వాహక ఇంజినీరు ప్రసాద్‌బాబు, ఉపకార్యనిర్వాహక ఇంజినీరు మాధవరావు, ఏసీపీ శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రోడ్డు పరిశీలన

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డును జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పరిస్థితిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కమిషనర్‌కు వివరించారు. బాలచెరువు రోడ్డు గంగవరం పోర్టు వంతెన వరకు ఛిద్రమైందని, కొత్తగా తారు రోడ్డు నిర్మించాలని కోరారు. స్పందించిన కమిషనర్ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్య వేక్షక ఇంజినీర్ రవిని ఆదేశించారు. గాజువాకలో ప్ర ధాన సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. జెడ్సీ సింహాచలం, ఈఈ ప్రసాద్‌బాబు, డీఈఈ మాధవరావు, ఏసీపీ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 67వ వార్డులో రూ.1.94 కోట్లతో అభివృద్ధి పనులు



67వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: నియోజకవర్గంలో కోట్లాది రూపాయల ఖర్చుతో మౌలిక వసతులను అందుబాటులోకి తెస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 67వ వార్డులో రూ.1.94 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని, ఇప్పటికే అనేక పనులను పూర్తి చేశామని తెలిపారు. 67వ వార్డులో రూ.1.94 కోట్లతో తొమ్మిది చోట్ల పనులను చేపట్టనున్నామన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, సీనియర్ నాయకుడు పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జేసీ విశ్వనాథన్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

అగనంపూడి: జిల్లాల విభజన వల్ల అగనంపూడి, ఫార్మాసిటీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అగనంపూడికి చెందిన నిర్వాసిత నాయకులు విశాఖ జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను కోరారు. ఈ మేరకు వారు జేసీని కలిసి, వినతిపత్రం సమర్పించారు. అగనంపూడి, ఫార్మాసిటీ కాలనీలు విశాఖ జిల్లాలో ఉండగా.. పాఠశాలలు మాత్రం పరవాడ, అనకాపల్లి మండలాల్లో ఉన్నాయని, దీని వల్ల విద్యావిభాగం అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, హుద్‌హుద్ కాలనీల నుంచి సమీప మార్గంగా ఉన్న తలారివాని పాలెం అండర్ బ్రిడ్జిని విస్తరించాలని, అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేయాలని కోరారు. జిల్లా స్థాయిలో సత్ఫలితాలు సాధిస్తున్న అగనంపూడి జూనియర్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీని కలిసిన వారిలో అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ ఉన్నారు.


పునాది దశలో విద్యను బలోపేతం చేయాలి

- సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- జ్ఞానజ్యోతి రెండో విడత శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ పీడీ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: పునాది దశ నుంచే విద్యను బలోపేతం చేయాలని ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో అభ్యసన స్థాయి, తరువాత దశల్లో విద్యార్థులకు కీలకంగా మారగలదన్నారు. షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 6 రోజుల పాటు నిర్వహించనున్న రెండో విడత జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు అయిన డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ (డీఆర్‌పీ) శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అలవాటు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కీ రిసోర్స్ పర్సన్ (కేఆర్‌పీ)ల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కేఆర్‌పీలు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్)లకు ఇచ్చే శిక్షణ విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అకడమిక్ మోడలింగ్ ఆఫీసర్ (ఏఎంవో)లను పరిచయం చేసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు ఈ శిక్షణను సంయుక్తంగా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, అగిరిపల్లి, ఒంగోలు, కడప, తిరుపతి, అనంతపురంలలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం జోన్–1 ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డి.వెంకటేశ్వరి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, ప్రథమ్ ఎన్‌జీవో స్టేట్ కో–ఆర్డినేటర్ కె.సురేష్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ మహేశ్వర రెడ్డి, ఏఎంవో జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కేఆర్పీలు, ఏఎంవోలు, అంగన్‌వాడీ టీచర్లు

ఢిల్లీకి చేరిన బీజేపీ నాయకులు



ఢిల్లీలో బీజేపీ నాయకులు

గాజువాక: నాభూమి–నాదేశం కార్యక్రమంలో పాల్గొనేందుకు గాజువాకకు చెందిన బీజేపీ నాయకులు సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఇటీవల ఇక్కడ సేకరించిన మట్టి కలశాలతో రైల్లో ఢిల్లీ చేరుకున్న నాయకులకు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు స్వాగతం పలికారు. ఢిల్లీ వెళ్లిన వారిలో కరణంరెడ్డితో పాటు నాయకులు కోసూరు తాతారావు, కానూరు అప్పలరాజు, అప్పారావు, కృష్ణంరాజు, ఇందల అప్పారావు తదితరులున్నారు.

కేంద్రప్రభుత్వం దిగొచ్చేవరకు పోరాటం



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక శక్తి ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక శక్తిని ఆపాలనుకునే ఇటువంటి ప్రభుత్వ పాలనను మునుపెన్నడూ చూడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 991వ రోజు, సోమవారం స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ఎన్నటికీ ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరంతరాయంగా పోరాటం చేస్తునే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆటోలో మేయర్.. సైకిల్‌పై కమిషనర్



ఆటోలో జీవీఎంసీకి చేరుకున్న మేయర్



సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. మేయర్ హరివెంకట కుమారి సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

జీఎస్‌టీ అధికారుల తనిఖీలు



ఉప్పల మంగరాజు గిడ్డంగిలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతబయలు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉప్పల మంగరాజుకు చెందిన వ్యాపార సంస్థలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన సోదరుడు ఉప్పల రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు వీరు వచ్చినట్టు తెలిసింది. సంతబయలు ప్రాంతంలో ఉప్పల చిన వెంకటరమణకు 15వ నంబరు రేషన్ డిపో ఉంది. ఈ డిపో ఉన్న షాపు తనదని కొంతకాలంగా తండ్రి చిన వెంకటరమణ, తమ్ముడు మంగరాజుతో రమేష్ బాబు న్యాయపోరాటం చేస్తున్నాడు. దీనిపై పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు అగ్గిపెట్టెల వ్యాపారంతోపాటు అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపిస్తూ సెంట్రల్, స్టేట్ జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఈ నెల 18న సెంట్రల్ జీఎస్టీ అధికారులు, సోమవారం స్టేట్ జీఎస్టీ అధికారులు మంగరాజు గిడ్డంగిని పరిశీలించి అగ్గిపెట్టెలు మాత్రమే ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. తనిఖీలకు సంబంధించి జీఎస్టీ అధికారులు ఎలాంటి సెర్చ్ వారెంట్లు తనకు చూపలేదని మంగరాజు తెలిపారు. దీనిపై మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధం



అగ్నికి ఆహుతైన బైక్

అక్కిరెడ్డిపాలెం: ఇంటి బయట పార్క్ చేసిన బైక్ అగ్నికి ఆహుతైంది. బాధితుడు, స్థానికులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాపీ పనులు చేసుకునే బసవ సంతోష్ కుమార్, అతని తల్లి నాతయ్యపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. సంతోష్ కుమార్ స్నేహితుడు ఊరు వెళ్తుండటంతో స్నేహితుడి పల్సర్ బైక్‌ను వాడుకోవటానికి తీసుకున్నారు. ఆదివారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. కొంతసమయం తర్వాత చుట్టు పక్కల వాళ్లు గట్టిగా కేకలు వేస్తుండటంతో ఏమైందని బయటకు వచ్చి చూడగా.. పల్సర్ బైక్ మంటల్లో కాలి బూడిదైంది. ఎవరైనా బైక్‌కు కాల్చారా, లేదా బైక్ నుంచి మంటలు వ్యాపించాయా అనేది తెలియలేదు. ఘటనపై బాధితుడు సంతోష్ కుమార్ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరైనా నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా మెరుగైన వైద్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



బీసీ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



షీలానగర్‌లోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 69వ వార్డు సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ వారి సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులు రోగుల ఇంటికి వెళ్లి, వైద్యపరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల చెంతకు వైద్యసేవలు తీసుకువచ్చిన ఘనత మన ముఖ్యమంత్రిదే అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా పేద ప్రజల సంక్షేమానికి ఇంతగా పాటు పడిన దాఖలాలు లేవన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం కల్పించడంతో పాటు, పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే చెందుతుందన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, 69వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, రజక కార్పొరేషన డైరెక్టర్ యువశ్రీ , వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డు బీసీ కాలనీలో 522 మందికి..

అగనంపూడి: రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు బీసీ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగానే తెలుసుకుని, చికిత్స చేసే అవకాశం ఉంటుందని, తద్వారా ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ నిర్మాణం సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి ఈ బృహత్తర కార్యక్రమానికి పూనుకున్నారన్నారు. మేధావులు, ప్రతిపక్షాలు సైతం మెచ్చుకునే రీతిలో కార్యక్రమం కొనసాగుతుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మేలు చేయడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు అయినా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 522 మందికి ఆరుగురు వైద్యులు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. శిబిరంలో గైనిక్, ఆర్థో, పిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్యనిపుణులు, డెంటిస్ట్, జనరల్ సర్జన్ సేవలు అందించారు. కార్యక్రమంలో గాజువాక ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జిల్లా నాయకులు నక్కా రమణబాబు, నాయుడు, లంకెలపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దివ్య, వైద్య బృందం పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



దుర్గాదేవిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: యువత ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రుద్ర ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో పాతగాజువాకలో ఏర్పాటు చేసిన 51 అడుగుల దుర్గాదేవిని పలువురు కార్పొరేటర్లతో కలిసి ఆయన సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సన్మార్గంలో ప్రయాణించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. గాజువాక ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, రాజాన రామారావు, కేబుల్ మూర్తి, పల్లా శ్రీనివాసరావు, మహ్మద్ ఇమ్రాన్, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, గుడివాడ లతీష్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు యల్లపు వేదార్థన్, ఉరుకూటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం



విజిలెన్స్ వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవంబర్ 5 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీవో) డాక్టర్ ఎస్.కరుణరాజు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన అన్ని విభాగాలు, గనులు, లైజన్, మార్కెటింగ్ కార్యాలయాల్లోని వివిధ ప్రదేశాల్లో ఆయా విభాగాధిపతులు, ఉద్యోగులు సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

ఒకరికి 5 రోజుల జైలు

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 2వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు 22 మందికి జరిమానాలు, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం ప్రాంతాల్లో గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మందిపై కేసులు ఇటీవల నమోదు చేశారు. వారిని సెక్షన్ 180, 181, 185, ఎంవీ ఎక్ట్ ప్రకారం రూ.2,000 నుంచి రూ.8,000 వరకు జరిమానాలు విధించారు. కొత్తపాలేనికి చెందిన గంట్యాడ నాగభూషణానికి 5 రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా వేశారు.